క్లుప్తంగా

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

శిరివెళ్ల: సీజనల్ వ్యాధులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా వ్యాధి నివారణ అధికారి డాక్టర్ విజయకుమార్ సూచించారు. గోవిందపల్లెలో ఇద్దరి మలేరియా సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు బుధవారం ఆయన వ్యాధిగ్రస్తుల ఇళ్లు, పరసరాలను పరిశీలించారు. వ్యాధి వ్యాప్తి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 200 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్‌ఓ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదుతో లాభాలు

దొర్నిపాడు: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు రైతులు ఈ–క్రాప్ నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారి సునీత తెలిపారు. రైతులు స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీపీఏ వంశీకృష్ణ పాల్గొన్నారు.

స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోండి

ఉయ్యాలవాడ: కుందూనది, చెరువులు, ఎస్సార్బీసీ కాలువల పరిధిలో వరి పంట సాగు చేసే రైతులు ఈ ఏడాది స్వల్పకాలిక రకాల పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరి నాటికి కాలువలకు నీరు విడుదలైతే వరి నాట్లు వేయరాదన్నారు. ఆలస్యంగా వేస్తే పెట్టుబడులు పెరిగి చీడ పీడల ఉధృతి అధికమవుతుందన్నారు.దీంతో దిగుబడి తగ్గి పంటలు నష్టపోవాల్సి వస్తుందన్నారు.

నంద్యాల(అర్బన్): వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మండల రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఏఓ ప్రసాదరావు తెలిపారు. మండలంలోని బిల్లలాపురం, కానాల గ్రామాల ఆర్బీకేలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జొన్న, మినుము, కొర్ర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు.

పింఛన్ల పరిశీలన



సర్వాయిపల్లెలో దివ్యాంగురాలి వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : మండలంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు కొత్త పింఛన్ల కోసం ఆయా గ్రామ సచివాలయాల్లో 99 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రెండు టీములుగా ఏర్పడి గ్రామాల్లో పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఆర్.జంబులదిన్నె, సర్వాయిపల్లె, పెద్దయమ్మనూరు, ఇంజేడు, బోడెమ్మనూరు గ్రామాల్లో దరఖాస్తులు చేసుకున్న వారి గురించి విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. పూర్తి సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

రుణాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గోస్పాడు: పీఎంఈజీబీ కింద అందజేసిన రుణాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దీబగుంట్ల గ్రామంలో ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పీఎంఈజీబీ కింద మంజూరైన ఎంబ్రాయిడరీ మిషన్‌ను మహిళ అనితకు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఆర్థిక సహకారం అందించేందుకు పీఎంఈజీబీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న అనితకు ఆ స్కీం కింద రూ.4,40,100 విలువజేసే ఎంబ్రాయిడరీ మిషన్‌ను మంజూరు చేసినట్లు చెప్పారు. డీపీఎంబీ దానం, వెలుగు సీసీ శ్రీనివాసులు. మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయటం నేరం

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని నంద్యాల ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ తెలిపారు. బాల్య వివాహాలతో మాతా శిశు మరణాలు జరగటమే కాకుండా పిల్లల్లో మానసిక, శారీరక వికలత్వం కలుగుతుందన్నారు. నంద్యాల మండలం పోలూరు గ్రామంలో బుధవారం బాల్య వివాహాలు వద్దంటూ జీవనజ్యోతి వొకేషనల్ ఇనిస్టిట్యూషన్ విద్యార్థినులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

చాగలమర్రి: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీపీ వీరభద్రుడు సూచించారు. బుధవారం శెట్టివీడు గ్రామ సచివాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయానికి వివిధ పనులపై వచ్చే వారితో మర్యాదగా మెలగాలన్నారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఎంపీడీఓ మహబుబ్‌దౌలాతో పాటు పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి స్వప్న, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్ ఉన్నారు.

రీ సర్వేతో భూములకు రక్షణ

నంద్యాల(అర్బన్): రీ సర్వేతో పొలాలు, స్థలాలతోపాటు ప్రభుత్వ భవనాలకు నూతన కొలతలతో కంప్యూటరీకరణ చేసి భద్రత కల్పించే జగనన్న భూహక్కు– భూరక్ష పథకం ఉపయోగకరమని, దీని ద్వారా ఆస్తులకు రక్షణ లభిస్తుందని భూ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మండలంలోని గుంతనాల గ్రామంలో వీఆర్వో మాధవ అధ్యక్షతన బుధవారం భూహక్కు– భూరక్ష గ్రామ సభను నిర్వహించారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల (సిటీ): కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా రవి పేర్కొన్నారు. బుధవారం 38వ వార్డు వైఎస్సార్ నగర్‌లో వార్డ్ ఇన్‌చార్జ్ రమణ, కౌన్సిలర్ సావిత్రమ్మతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వార్డులో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయని, సచివాలయ వ్యవస్థ తీరుపై ఆరా తీశారు. చైర్ పర్సన్ మబ్బున్నిసా, ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు, నాయకులు అంకాలయ్య, బాబురావు, నరసింహారావు శెట్టి, తిరుపతయ్య, జాకీర్ హుసేన్, అన్వర్ బాషా, రామకృష్ణా రెడ్డి, ప్రసాద్ రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామి శెట్టి, ఉమాకాంతయ్య, బాబు, చిరు, సోమశేఖర్, శివ, గోరే, ముర్తుజా, చెన్నప్ప పాల్గొన్నారు.

ఆడుదాం.. ఆంధ్రా కార్యాచరణ రూపొందించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ, అధికారులు

నంద్యాల(న్యూటౌన్): ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని, అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లకు రాష్ట్ర క్రీడాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు పాల్గొన్నారు. ప్రద్యుమ్న మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు పోటీలు నిర్వహించాలని,. అన్ని శాఖల అధికారులు ఇందులో పాల్గొనాలన్నారు. మాస్టర్ డేటా ప్లాన్ తయారు చేయడంలో జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. గ్రామ సచివాలయ స్థాయిలో స్పోర్ట్స్ కిట్లును ఉచితంగా పంపిణీ చేసి గ్రామస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి నుండి నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు అందజేయాలన్నారు. పోటీలకు జాయింట్ కలెక్టర్లను నోడల్ ఆఫీసర్లుగా నియమించామని చెప్పారు.

ఓటర్ల జాబితాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఓటర్ల ఇంటింటి పరిశీలనపై బీఎల్‌ఓలకు మరోసారి శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో ఓటర్ల జాబితా తయారీ, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల ధ్రువీకరణ తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేయాలని చెప్పారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను భాగస్వామ్యం చేయాలని సూచించారు. సుమోటోగా డబుల్ ఓటర్లను తొలగించకుండా ఫారం–7 ద్వారా అవసరమైన ఫార్మెట్‌లో పూరించి ప్రత్యేక దస్త్రాల్లో భద్రపరచాలన్నారు. డీఆర్‌ఓ పుల్లయ్య, అన్ని నియోజకవర్గాల ఈఆర్వో, ఏఈఆర్వోలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

నంద్యాల(సిటీ): సచివాలయ సిబ్బంది క్రమశిక్షణతో అప్పగించిన పనులను నిర్దేశిత కాల పరిమితిలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని 24వ వార్డు విద్యానగర్, వైఎస్సార్ నగర్ లోని 38 వ వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమయ పాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలైనప్పటికీ భోజనానికి వెళ్లిన సిబ్బంది సచివాలయానికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలో స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. పట్టణంలో పెండింగ్ ఉన్న 2,500 మంది పిల్లల నమోదును వెంటనే పూర్తి చేయాలని డీఈఓ సుధాకర్ రెడ్డిని ఆదేశించారు. ప్రాథమిక విద్యలో బడి ఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే) వంద శాతం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు.

సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి



తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపై సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌ఈ

రుద్రవరం: తెలుగుగంగ కాల్వల ద్వారా వచ్చే నీటిని వృథా కానివ్వకుండా పొదుపుగా వాడుకోవాలని ఆ శాఖ ఎస్‌ఈ వెంకటరమణ సూచించారు. బుధవారం తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్ట వెంట వెళ్తూ కాల్వలో ప్రవహిస్తున్న నీటి సామర్థ్యాన్ని పరిశీలించి బ్లాకుల వారీగా సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వెలుగోడు రిజర్వాయరు నుంచి 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా రుద్రవరానికి వచ్చే సరికి కాల్వలో 500 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోందన్నారు. ఎగువ భాగం నుంచి బ్లాకుల తూముల్లో అధికంగా నీరు వదలకుండా తగిన మోతాదులో పారేల చర్యలు తీసుకున్నామన్నారు. గండ్లేరు జలాశయం పూర్తిగా నిండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం ఉప ప్రధాన కాల్వల్లో నీటి విడుదలను పెంచుతామని చెప్పారు. ప్రస్తుతం నాలుగు రోజల పాటు నీరు పారుతుందని, మళ్లీ పది రోజల తర్వాత విడుదల చేస్తామని పేర్కొన్నారు. వరి సాగుకు పూనుకోవద్దని, కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ఆరుతడి పంటలు దెబ్బతినకుండా ఉండేందుకే నీటిని విడుదల చేశామని చెప్పారు. జేఈలు రవీంద్రనాథ్, స్వరాజ్యకుమార్ రామశేషు ఉన్నారు.

పంచాయతీ ఫలితాలు టీడీపీకి చెంపపెట్టు



గోవిందపల్లెలో వృద్ధురాలికి అందిన పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రా రెడ్డి

శిరివెళ్ల: ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో ప్రజల తీర్పు టీడీపీకి చెంపపెట్టని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి అన్నారు. బుధవారం గోవిందపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, వాహన మిత్ర, పక్కా గృహాలు ద్వారా ఇంటింటికి ఎంత లబ్ధి చేకూరందనేది చదివి వినిపించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పథకాల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందిన వారంతా పంచాయతీ ఉప ఎన్నికల్లో తమ పార్టీ మద్దతుదారులకు ఓటేశారని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, సర్పంచు మరియమ్మ, ఉప సర్పంచు శేషారెడ్డి, సొసైటీ చైర్మన్ నర్ల రాజశేఖరరెడ్డి, ఎంపీటీసీ స్వాతి, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దిల్ సలాం, కామినేనిపల్లె, బోయలకుంట్ల, వీరారెడ్డిపల్లె సర్పంచులు మేర్వ చిన్న నరసింహారెడ్డి, జింకల నాగన్న, మందాల శివారెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఈఓఆర్డీ నాగేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు



చైర్‌పర్సన్ ఛాంబర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని ఎమ్మెల్యే శిల్పా రవింద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆధునికీకరించిన చైర్‌పర్సన్ ఛాంబర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసాతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సేవలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుందన్నారు. ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. నంద్యాల ప్రజల ఆకాంక్షలను తీర్చి వారికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తున్న సీఎం జగనన్న కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి,కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, నాయకులు, అధికారులు ఉన్నారు.

నేటి తరానికి టంగుటూరి ఆదర్శం

నంద్యాల(సెంట్రల్): స్వాతంత్రోద్యమ పోరాటంలో అకుంఠిత ధైర్య సాహసాలు, అసమాన త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శప్రాయుడని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) సహ సంచాలకులు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రాంగణంలో ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏడీఆర్, సిబ్బందితో కలిసి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

నంద్యాలటౌన్: 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బుధవారం నూతనంగా నియమించబడిన ఆశా కార్యకర్తలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు టీకాలు వేయించుకోవడం వల్ల ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. ఇందుకు గాను ప్రతి ఆశా కార్యకర్త ఇంటింటికి తిరిగి చిన్నారులు, గర్భిణీ స్త్రీల వివరాలు సేకరించి వారి ఆరోగ్య వివరాలు నమోదు చేయాలన్నారు. శిక్షకురాలు ప్రతిభ, సరళ గంగ, స్వర్ణ గౌరి, వీరన్న పాల్గొన్నారు.

ట్రాక్టరును ఢీ కొన్న బస్సు.. రైతుకు తీవ్ర గాయాలు

చాగలమర్రి: మండలంలోని మల్లెవేముల గ్రామ సమీపంలో వ్యవసాయ పనుల నిమిత్తం పొలంలోకి వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొన్న సంఘటనలో గ్రామానికి చెందిన రైతు అజిమొద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు అజిమొద్దీన్ బుధవారం పొలంలో వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టరుతో బయలుదేరాడు. ట్రాక్టరు ఎస్ఎస్ ట్యాంకు వద్దకు చేరుకొని తన పొలంలోకి తిప్పుతుండగా..ప్రొద్దుటూరు నుంచి ఆళ్లగడ్డ వైపునకు వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొంది. దీంతో ట్రాక్టరులో ఉన్న అజిమొద్దీన్‌కు తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోనున్నవ వారు చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొనడంతో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చాగలమర్రి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

గోరుకల్లుకు మరమ్మతులు చేపట్టాలి

నంద్యాల(సెంట్రల్): పాక్షికంగా దెబ్బతిన్న గోరుకల్లు జలాశయం నిర్మాణ పనులు వెంటనే చేపట్టకపోతే రాయలసీమ రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం సమితి స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జలాశయాన్ని 261.5 మీటర్ల గరిష్ట స్థాయిలో 12.44 టీఎంసీల పరిమాణంలో నీటిని నిలువ ఉంచే విధంగా రూపొందించారన్నారు. కానీ అలల తాకిడిని తట్టుకోవటానికి వీలుగా 265.6 మీటర్ల స్థాయిలో రివిట్‌మెంట్‌తో కూడిన బండ్ నిర్మాణం చేయాలని నివేదికల్లో ఉందన్నారు. కానీ ప్రభుత్వం 261 మీటర్ల స్థాయికే బండ్ నిర్మాణాన్ని పరిమితం చేయటంతో రివిట్‌మెంట్ 60 మీటర్ల మేర కిందకు జారిందని చెప్పారు. ఉపాధ్యక్షులు ఏరువ రామచంద్రారెడ్డి, పట్నం రాముడు, భాస్కర్‌రెడ్డి, షణ్ముఖరావు, నిట్టూరు సుధాకర్‌రావు, పర్వేజ్ పాల్గొన్నారు.

టీడీపీది గోబెల్స్ ప్రచారం

శిరివెళ్ల: ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీల ఉప ఎన్నికల్లో టీడీపీ గోబెల్స్ ప్రచారం చేసిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రానాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి గోవిందపల్లెలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంప్రమాన్‌దిన్నె మజరా గ్రామం గాంధీనగరంలోని 12 వార్డుకు ఉప ఎన్నికకు నోటీఫికేషన్ జారీ కాగా.. ఆ గ్రామంలో గత 12 ఏళ్లుగా గ్రామస్తులందరూ ఏకమై రాజకీయాల కతీతంగా ఓ అభ్యర్థినిని నామినేషన్ చేయించడం సంప్రదాయంగా వస్తుంది. ఇప్పుడు కూడా అక్కడ అదే జరిగింది. ఓ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దానిని టీడీపీ తన ఖాతాలో వేసుకొని, తమ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రచారం చేయించుకున్నారని, గమనించిన గ్రామస్తులు తమకు రాజకీయాలు వద్దని, నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. మాజీ మంత్రి అఖిలప్రియ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతోందన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత

నంద్యాలటౌన్: నంద్యాల సర్వజన ఆసుపత్రికి జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ లిమిటెడ్ వారు బుధవారం అంబులెన్స్‌ను విరాళంగా ఇచ్చారు. కంపెనీ జనరల్ మేనేజర్ కేశవరెడ్డి మాట్లాడుతూ పేద రోగుల అత్యవసరాలను దృష్టిలో ఉంచుకుని అంబులెన్స్‌ను అందజేశామని చెప్పారు. కంపెనీ యాజమాన్యాన్ని ఆసుపత్రి సూరింటెంటడెంట్ డాక్టర్ వరప్రసాదరావు అభినందించారు.

చంద్రయాన్-3 విజయవంతంపై సంబరాలు



కలెక్టర్‌కు మిఠాయిలు పంచుతున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): చంద్రయాన్–3 విజయవంతంపై నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. డీఈఓ సుధాకర్‌రెడ్డి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ లక్ష్మినారాయణ మిఠాయిలు తినిపించుకున్నారు.

ఉయ్యాలవాడ : చంద్రయాన్–3 విజయవంతం కావాలంటూ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. బుధవారం మండలంలోని మాయలూరు జిల్లా పరిషత్ విద్యార్థులు చంద్రయాన్–3 విజయవంతం ఆకాంక్షిస్తూ గ్రామంలోని వీధుల్లో ర్యాలీ చేపట్టారు.

దొర్నిపాడు: చంద్రయాన్–3 చంద్రుడి ఉపరితలంపై బుధవారం సాఫ్ట్ ల్యాండింగ్‌ను వీక్షించేందకు ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. చంద్రయాన్–3 విజయవంతం చేయాలని ప్రార్థనలు చేశారు.

జిల్లా జంప్‌రోప్ పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా జంప్‌రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పద్మావతి నగర్‌లోని డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా జంప్‌రోప్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఎంపి క పోటీలు జరిగాయి. డీఎస్‌డీఓ నాగరాజు, ఎస్ఏ పీడీ రాష్ట్ర చైర్మన్ నిమ్మకాయల సుధాకర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు.

నకిలీ విత్తనాలతో మునిగిన రైతులు

- 70రోజులు దాటినా మినుములో పూత, పిందె రాని వైనం
- పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు
- తెనాలి వ్యాపారుడి నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు
- పంట సాగుకు ఎకరాకు రూ.25వేల వరకు ఖర్చు
- 400 ఎకరాల్లో పంట సాగు



ఎర్రగుడిదిన్నె వద్ద మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



రైతులు వినియోగించిన విత్తనాలను పరిశీలిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నె, పేరూరు గ్రామాల పొలిమేరలో నకిలీ మినుము విత్తనాలతో పంట సాగు చేసి రైతులు నిండా మునిగారు. 400 ఎకరాల్లో పంట సాగు చేయగా 70 రోజులు దాటినా పూత,పిందె రాక పోవడంతో రైతులు లబో దిబోమంటున్నారు. నకిలీ విత్తన సమస్యను రైతులు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే పంటను పరిశీలించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో మండల వ్యవసాయాధికారి శ్రీ కృష్ణ ఉన్నతాధికారులకు సమాచారమివ్వడంతో బుధవారం నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు జయలక్ష్మి, మంజునాథ, ప్రభాకర్, ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహన్ తదితరులు రైతులు సాగు చేసిన మినుము పంటను పరిశీలించి వివరాలు సేకరించారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఓ వ్యాపారస్తుడి నుంచి పీయు–31 అనే రకం మినుము విత్తనాలు కొనుగోలు చేసి దాదాపు 400 ఎకరాల్లో పంట సాగు చేశామని, అయితే 70 రోజులు పూర్తియనా పూత, పిందె ఏవీ రాలేదని, పంట సాగు కోసం ఎకరాకు దాదాపు రూ.25వేల వరకు పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుత పరిస్థితితో పూర్తిగా నష్టపోయామని రైతులు శాస్త్రవేత్తలకు వివరించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ సాగు చేసిన మినుములు పీయు–31 రకానికి చెందినవి కాదని తేల్చి చెప్పారు. పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదికలు అందజేస్తామని రైతులకు తెలిపారు. గంగుల విజయసింహారెడ్డి, పుల్లారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

అన్నదానం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని చామకాలువ సెంటర్లో ఉన్న ఉషా మనోవికాస్ ఆశ్రమంలో బుధవారం దివ్యాంగ విద్యార్థులకు శ్రీశైల యాదవ నిత్యాన్నదాన సత్రం సెక్రెటరీ సత్యనారాయణ యాదవ్ అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మనోవికాస్ చైర్మన్ స్వాతి, లక్ష్మణ్, కుమార్, వెంకట సుబ్బయ్య, భోదనం చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.